తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | బుధవారం-18 - జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 289 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారు

అసెంబ్లీలో భట్టి విక్రమార్క విమర్శలు

గత బీఆర్ఎస్ పాలనపై ఉప ముఖ్యమంత్రి తీవ్ర ఆరోపణలు

రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని వెల్లడింపు

ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల మంజూరు చేసినట్లు ప్రకటన



**హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత పదేళ్ల పాలనలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారని ఆరోపించారు. పేదలకు ఇళ్లు అందిస్తామని చెప్పినా ఆ హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారని, వేలాది కుటుంబాలు ఇంకా ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నాయని అన్నారు. డబుల్ బెడ్రూమ్ పథకాన్ని ప్రచారానికి మాత్రమే పరిమితం చేసి ప్రజలను మోసం చేశారని అసెంబ్లీలో విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు గూడు కల్పించడమే ముఖ్య లక్ష్యంగా పనిచేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే రూ.22,500 కోట్ల వ్యయంతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. ఈ పథకం ద్వారా గూడు లేని నిరుపేద కుటుంబాలకు సొంత ఇళ్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి సుమారు 3,500 ఇళ్లను మంజూరు చేసినట్లు అసెంబ్లీలో వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు స్థిర నివాసం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

మిగతా 2లో

## బీఆర్ఎస్ నేతలే నిరంకుశత్వానికి ప్రతీకలు: మంత్రి పొంగులేటి

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- కేటీఆర్ అహంకార వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారన్న మంత్రి
- ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే తీర్పు చెప్పారని వ్యాఖ్య



**హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్య విలువలను గౌరవించకుండా నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ నేతలే నిరంకుశత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారని ఆరోపిస్తూ, వారు తరచూ కట్టు కథలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మాటల గారడీలతో రాజకీయాలు చేయడం ఆ పార్టీ నాయకులకు అలవాటైపోయిందని విమర్శించారు. అసెంబ్లీలో జరిగిన చర్చల సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా కేటీఆర్ మాట్లాడుతున్న తీరు అహంకారాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించడం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత అని సూచించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పును కూడా ప్రశ్నించడం వారి వైఖరిని స్పష్టంగా చూపిస్తోందని ఆయన అన్నారు.

మిగతా 2లో



## ప్రజా పోరాటాలకు విజయం

వెలుగుమట్ల బాధితులకు పట్టాల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం

411 మంది బాధితులకు పట్టాలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం

750 ఇండ్లు కూల్చివేసి కొందరికే పట్టాలివ్వడంపై బాధితుల అభ్యంతరం

ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్న కవిత

**ఖమ్మం, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదల ఇండ్ల కూల్చివేత వ్యవహారంలో ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది. అరాచక పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి మరియు ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ విశారధన్ మహారాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంయుక్త పోరాటాల ఫలితంగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఇండ్లు కోల్పోయిన వారిలో 411 మందికి పట్టాలు ఇస్తామని అధికారికంగా ప్రకటించింది. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తే తప్పకుండా విజయం సాధిస్తాయనే విషయం ఈ పరిణామంతో మరోసారి నిరూపితమైందని తెలంగాణ

మిగతా 2లో

## పార్సీగుట్టలో చికెన్ షాపుపై దాడులు




- టాస్క్ ఫోర్స్, జీహెచ్ఎంసీ సంయుక్త తనిఖీలు
- 800 కిలోల నిల్వ చికెన్ స్వాధీనం
- లైసెన్స్ గడువు ముగిసినా వ్యాపారం

**హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలోని పార్సీగుట్ట ప్రాంతంలో ఉన్న ఒక చికెన్ దుకాణంపై సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఏవన్ ఫ్రెష్ చికెన్ అనే పేరుతో నడుస్తున్న ఈ దుకాణంలో చాలా రోజులుగా నిల్వ ఉంచిన చికెన్ విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల సమయంలో సుమారు 800 కిలోల చికెన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

మిగతా 2లో

## సిద్దిపేట అభివృద్ధిపై సీఎం రేవంత్‌కు హరీష్‌రావు బహిరంగ లేఖ

- రూ.1070 కోట్ల నిధులు పునరుద్ధరించాలని డిమాండ్
- అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆరోపణ
- సిద్దిపేటపై కక్షపూరిత వైఖరి ఎందుకని ప్రశ్న



**సిద్దిపేట, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** సిద్దిపేట అభివృద్ధి అంశంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి

మిగతా 2లో



## కాజీపేటలో రైల్వే తయారీ యూనిట్ త్వరలో ప్రారంభం


- 85 శాతం పనులు పూర్తి చేసిన ఆర్ఎమ్‌యూ
- రూ.521 కోట్లతో నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టు
- ప్రాంత పారిశ్రామికాభివృద్ధికి ఊతం

2లో

## మియాపూర్‌లో మినీ బస్సు బోల్తా.. పలువురికి గాయాలు

- బాచుపల్లి సమీపంలో మలుపు వద్ద ప్రమాదం
- ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులతో వెళ్తున్న వాహనం
- గాయపడిన వారిని ఆస్పత్రికి తరలింపు

2లో



## 11 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా

- రూ.1650 కోట్ల విలువైన భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు
- కొండాపూర్‌లో పార్కు స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షణ
- ప్రగతినగర్‌లో స్మశానవాటిక, డంపింగ్ యార్డు భూమి సంరక్షణ



**హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను ఆక్రమణల నుంచి రక్షిస్తూ హైడ్రా కీలక చర్యలు చేపట్టింది. మొత్తం 11 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి కాపాడినట్లు అధికారులు తెలిపారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ భూముల విలువ సుమారు రూ.1650 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

మిగతా 2లో

## రైతు సమస్యలపై అసెంబ్లీ వద్ద బీజేపీ నిరసన

- రైతు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్
- రైతు భరోసా నిధులు విడుదల చేయాలని కోరిన నేతలు
- పంట బీమా పథకం అమలు చేయాలని విజ్ఞప్తి



**హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో భారతీయ జనతా పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పార్టీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మరియు పార్టీ నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నేతలు ఆరోపించారు. ముఖ్యంగా రైతుల సంపూర్ణ రుణమాఫీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఆగిపోయిన రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్రంలో పంట నష్టాలను ఎదుర్కొనే రైతులకు రక్షణ కల్పించేందుకు పంట బీమా పథకాన్ని అమలు చేయాలని కూడా బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. రైతుల ఆర్థిక భద్రత కోసం ఈ పథకం కీలకమని వారు పేర్కొన్నారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

పేదలకు గూడు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో పేదల కోసం చేపట్టిన పథకాలు అమలులో అనేక లోపాలు ఉన్నాయని భట్టి విక్రమార్క ఆరోపించారు. పేదల సంక్షేమం కంటే ప్రచారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకుని స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మక నిర్ణయమని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గూడు లేని నిరుపేదలకు సొంత ఇళ్లు కల్పించడం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. పేదలకు భద్రమైన నివాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క అసెంబ్లీలో స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, సామాజిక సమానత్వం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

# బీఆర్ఎస్ నేతలే నిరంకుశత్వానికి ప్రతీకలు: మంత్రి పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యంలో చట్టసభకు ఉన్న గౌరవాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయాలను ప్రశ్నించడం ద్వారా బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ వ్యవస్థను చిన్నబుచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల తరపున పనిచేయాల్సిన ప్రతిపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమైందని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి తగిన సమాధానం ఇచ్చారని మంత్రి



పొంగులేటి పేర్కొన్నారు. ప్రజల మద్దతు కోల్పోయిన పార్టీగా బీఆర్ఎస్ మారిందని, అందుకే ప్రజల్లో తిరిగి నిలబడేందుకు వారు రాజకీయ ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రజలు ఇప్పటికే ఆ పార్టీ పాలనను తిరస్కరించారని, ఎన్నికల ఫలితాలు దీనికి నిదర్శనమని అన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. విమర్శలతో కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించడమే నిజమైన రాజకీయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజా పోరాటాలకు విజయం

(మొదటి పేజీ తరువాయి)

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వ ప్రకటనపై బాధితుల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. వెలుగుమట్ల గ్రామంలో సుమారు 750 మంది పేదల ఇండ్లను ప్రభుత్వం కూలగొట్టిందని, కానీ ఇప్పుడు కేవలం 411 మందికి మాత్రమే పట్టాలు ఇస్తామని చెప్పడం సరికాదని బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన బాధితులకు ఎందుకు పట్టాలు ఇవ్వడం లేదని, తమకు అన్యాయం జరిగిందనే ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. కేవలం సగం మందికి మాత్రమే న్యాయం చేసి మిగిలిన వారిని గాలికి వదిలేయడం ప్రభుత్వ వివక్షకు నిదర్శనమని విమర్శలు వస్తున్నాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, ఈ విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆందోళనకారులు స్పష్టం చేస్తున్నారు.

పట్టాల పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని, బాధితులందరికీ న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఒక ప్రత్యేక నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీలో ఆర్మీ మాజీ అధికారి, ప్రొఫెసర్లు, హైకోర్టు న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు మరియు సీనియర్ జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ మార్చి 18వ తేదీన (బుధవారం) ఖమ్మంలో పర్యటించి, క్షేత్రస్థాయిలో బాధితులతో మరియు సంబంధిత వర్గాలతో మాట్లాడి అసలు వాస్తవాలను వెలికితీయనుంది. విద్యావంతులు, అనుభవజ్ఞులతో కూడిన ఈ కమిటీ పర్యటన బాధితుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. నిజ నిర్ధారణ కమిటీ పర్యటనకు ప్రభుత్వం మరియు స్థానిక అధికారులు సంపూర్ణంగా సహకరించాలని తెలంగాణ జాగృతి డిమాండ్ చేస్తోంది. బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ కమిటీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తుందని, ప్రతి అడుగును పర్యవేక్షిస్తుందని కవిత తెలిపారు. ఎంపిక చేసిన 411 మందిని ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు, మిగిలిన వారిని ఎందుకు పక్కన పెట్టారు అనే అంశాలపై కమిటీ లోతుగా విచారణ జరపనుంది. అధికారులు పారదర్శకంగా వ్యవహరించకపోతే న్యాయ పోరాటానికైనా సిద్ధమని కమిటీ సభ్యులు హెచ్చరిస్తున్నారు. వెలుగుమట్ల బాధితుల సమస్యను ఒక తార్కిక ముగింపునకు తీసుకువెళ్లే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం పట్టాల కోసం మాత్రమే కాదని, పేదల ఆత్మగౌరవం మరియు నివాస హక్కుల పరిరక్షణ కోసమని ధర్మ సమాజ్ పార్టీ మరియు తెలంగాణ జాగృతి నేతలు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలో జరిగే నిజ నిర్ధారణ కమిటీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. బాధితులందరినీ కలిసి వారి గోడును వినడంతో పాటు, అధికారులతో కూడా కమిటీ భేటీ కానుంది. ప్రభుత్వం ప్రకటించిన పట్టాల పంపిణీ హామీని తుచ తప్పకుండా అమలు చేయాలని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు అందేలా చూడటమే తమ అంతిమ లక్ష్యమని నేతలు పునరుద్ఘాటించారు.

# పార్సీగుట్టలో చికెన్ షాపుపై దాడులు

(మొదటి పేజీ తరువాయి)


ఈ చికెన్‌ను నగరంలోని పలు వైన్స్ షాపులు, బార్లు, రెస్టారెంట్లకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నిల్వ ఉంచిన చికెన్ ఆరోగ్యానికి హానికరంగా ఉండే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

దుకాణానికి సంబంధించిన లైసెన్స్ గత జనవరి నెలలోనే గడువు ముగిసినట్లు కూడా తనిఖీల్లో బయటపడింది. అయినప్పటికీ యాజమాన్యం అనుమతి లేకుండా వ్యాపారం కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత నిబంధనలు ఉల్లంఘించినందుకు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో షాపు నిర్వాహకుడు షకిల్‌తో పాటు మరికొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలో ఆహార భద్రతకు భంగం కలిగించే వ్యాపారాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



# మియాపూర్‌లో మినీ బస్సు బోల్తా..

**హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలోని మియాపూర్ పరిధిలో మినీ బస్సు బోల్తా పడిన ఘటనలో పలువురు గాయపడ్డారు. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ ప్రాంతం నుంచి ప్రైవేట్ ఉద్యోగులను తీసుకుని వెళ్తున్న మినీ బస్సు బాచుపల్లి సమీపంలో మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. లీ ఫార్మా కంపెనీకి చెందిన ఈ మినీ బస్సులో సుమారు 10 మంది ప్రైవేట్ ఉద్యోగులు గడ్డపోతారం వైపు వెళ్తున్నారు. మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు రోడ్డుపక్కకు బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న ఉద్యోగులు గాయపడ్డారు. గాయపడిన వారిలో చాలా



మందికి స్వల్ప గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం అనంతరం స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# రైతు సమస్యలపై అసెంబ్లీ వద్ద బీజేపీ నిరసన

(మొదటి పేజీ తరువాయి)


కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంట బీమా పథకాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని వారు కోరారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు తెలిపారు. అన్నదాతల కన్నీరు తుడిచే వరకు, వారికి దక్కాల్సిన హక్కులు సాధించే వరకు ఉద్యమం ఆగదని వారు స్పష్టం చేశారు.




# సిద్దిపేట అభివృద్ధిపై సీఎం రేవంత్‌కు హరీష్‌రావు బహిరంగ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

కోసం కేటాయించిన రూ.1070 కోట్ల నిధులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని ఆయన ఆరోపించారు. ఈ నిధులను వెంటనే పునరుద్ధరించి నిలిచిపోయిన అభివృద్ధి పనులను కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ నెల 22న సిద్దిపేటకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ బహిరంగ లేఖ రాశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 27 నెలల అనంతరం అధికారికంగా సిద్దిపేట నియోజకవర్గంలో అడుగుపెడుతున్నారని పేర్కొంటూ ఎమ్మెల్యేగా ఆయనకు స్వాగతం పలికారు. అయితే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిద్దిపేట పేరును తరచూ ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నియోజకవర్గాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సిద్దిపేట అభివృద్ధి కోసం రూ.1070.73 కోట్ల నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు ప్రారంభించామని హరీష్‌రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిధులను



రద్దు చేయడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికే చేసిన పనులకు కూడా నిధులు మంజూరు చేయకపోవడం దురదృష్టకరమని, దీంతో గత 27 నెలలుగా అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిధులు కొనసాగి ఉంటే సిద్దిపేట అభివృద్ధి మరింత వేగంగా జరిగేదని హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట ప్రగతిపై కక్షపూరితంగా వ్యవహరించకుండా ప్రభుత్వం వెంటనే రద్దు చేసిన నిధులను పునరుద్ధరించాలని కోరారు. మధ్యలో ఆగిపోయిన పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, అదే ముఖ్యమంత్రిగా మీ గౌరవాన్ని కాపాడే మార్గమని పేర్కొన్నారు.

రద్దు చేసిన నిధుల కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనుల వివరాలను కూడా హరీష్‌రావు తన లేఖలో ప్రస్తావించారు. వీటిలో ప్రభుత్వ వెటర్నరీ కళాశాల, రంగనాయకసాగర్ టూరిజం ప్రాజెక్టు, కోమటి చెరువు శిల్పారామం, సిద్దిపేట నియోజకవర్గ ఔటర్ రింగ్ రోడ్డు, తోర్నాలలో బీఎస్సీ వ్యవసాయ కళాశాల, మిట్టపల్లిలో మహిళా డిగ్రీ కళాశాల భవనం, క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ హబ్, టూ టౌన్ మరియు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ భవనాలు ఉన్నాయి. అదేవిధంగా సిద్దిపేట-ఇల్లంతకుంట ఫోర్ లేన్ రహదారి, సిద్దిపేట-కిష్టాపూర్ రహదారి, సిద్దిపేటలో మల్టీపర్పస్ ఆడిటోరియం, బ్లాక్ ఆఫీస్ సమీపంలో సమగ్ర కూరగాయలు మరియు మాంసం మార్కెట్ నిర్మాణం వంటి పనులు కూడా నిలిచిపోయాయని ఆయన పేర్కొన్నారు. ఈ పనులన్నింటినీ పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు తన లేఖలో కోరారు.

# 11 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో రెండు ఎకరాల పార్కు స్థలం, ఐదు ఎకరాల స్మశానవాటిక స్థలం, నాలుగు ఎకరాల డంపింగ్ యార్డు భూమి ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని సెంట్రల్ పార్క్ కాలనీలో పార్కు కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించారు. సర్వే నంబరు 110/1లో 1998లో 148 ప్లాట్లతో సుమారు 16 ఎకరాల మేర సెంట్రల్ పార్క్ కాలనీ ఫేజ్ 1 లేఔట్ ఏర్పాటు చేశారు. ఇందులో రెండు ఎకరాలను పార్కు కోసం కేటాయించారు. అయితే ఈ స్థలాన్ని కొందరు తమదని చెబుతూ ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా అధికారులు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పార్కు స్థలంగా నిర్ధారించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లను తొలగించారు. అనంతరం రెండు ఎకరాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు.



అదేవిధంగా ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిపై కూడా హైడ్రా చర్యలు చేపట్టింది. ఐదు ఎకరాల స్మశానవాటిక స్థలం, పక్కనే ఉన్న నాలుగు ఎకరాల చెత్త డంపింగ్ యార్డు భూమి ఆక్రమణలకు గురవుతున్నాయనే ఫిర్యాదులు అందాయి. కూకట్‌పల్లి మండలం బాగామేరి గ్రామం సర్వే నంబరు 103లో ఉన్న ఈ భూమిని రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ భూమి స్మశానవాటిక, డంపింగ్ యార్డు కోసం కేటాయించబడిన ప్రభుత్వ స్థలమని అధికారులు నిర్ధారించారు. హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాల మేరకు మొత్తం తొమ్మిది ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఐదు ఎకరాల భూమిని స్మశానవాటిక స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయగా, మిగిలిన నాలుగు ఎకరాలను ప్రభుత్వ డంపింగ్ యార్డు స్థలంగా గుర్తించారు. చెరువు సమీపంలో ఉన్న ఈ భూమి ఆక్రమణల నుంచి రక్షించబడటంతో స్థానికులు హైడ్రా చర్యలను అభినందించారు. ఎన్నో ఫిర్యాదులు చేసినప్పటికీ పరిష్కారం రాకపోయిందని, హైడ్రా చర్యలతో సమస్య పరిష్కారమైందని వారు తెలిపారు.

# కాజీపేటలో రైల్వే తయారీ యూనిట్ త్వరలో ప్రారంభం

**కాజీపేట, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలోని కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతోంది. భారతీయ రైల్వే సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. ఇప్పటికే ఈ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మొత్తం రూ.521.36 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. కాజీపేటలో ఏర్పాటు చేస్తున్న ఈ రైల్వే తయారీ కేంద్రం ద్వారా రైల్వే కోచ్‌లు, భాగాల తయారీ మరియు నిర్వహణ కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ యూనిట్ ప్రారంభమైతే రైల్వే రంగంలో సాంకేతిక సామర్థ్యాలు పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా విస్తరించే అవకాశముంది.



ప్రస్తుతం యూనిట్‌లో ప్రధాన షాప్, టెస్ట్ షాప్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అలాగే పెయింట్ షాప్, పరిపాలన భవనాల నిర్మాణం కూడా జరుగుతోంది. అంతర్గత రైల్వే ట్రాక్‌లు, ఇతర అవసరమైన సౌకర్యాల ఏర్పాట్లు కూడా వేగంగా పూర్తి దశకు చేరుకున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత కాజీపేట ప్రాంతం రైల్వే పరిశ్రమకు ముఖ్య కేంద్రంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. రైల్వే తయారీ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా ఈ యూనిట్ దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.




## ఈదురుగాలులకు నేలమట్టమైన పంటలు

- ప్రభుత్వం ఆదుకోవాలని వేలేరు రైతుల విజ్ఞప్తి

**వేలేరు, మార్చ్ 17 (తెలంగాణ ముచ్చట్లు):**

హన్మకొండ జిల్లా వేలేరు మండలంలోని పలు గ్రామాల్లో నిన్న రాత్రి వీచిన ఈదురుగాలుల ప్రభావంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. బలమైన గాలులు వీచడంతో మండలంలోని అనేక గ్రామాల్లో మొక్కజొన్న మరియు వరి పంటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకంగా వేలేరు మండలంలోని పలు గ్రామాల్లో ఎకరాల కొద్దీ సాగుచేసిన మొక్కజొన్న, వరి పంటలు నేలకొరిగి భారీ నష్టం వాటిల్లింది. అప్పులు చేసి పంటలు సాగుచేసిన రైతులు ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నష్టపోయిన పంటలను అధికారులు వెంటనే పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని, అలాగే నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని వేలేరు మండల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అధికారులు త్వరితగతిన స్పందించి రైతులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



## హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణకు శ్రీకారం

- రూ.30 కోట్లతో అభివృద్ధి
- డిజైన్లు పూర్తి, త్వరలో పనుల ప్రారంభం

**నాచారం, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గ నాచారం సర్కిల్ పరిధిలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఈ పనులకు సంబంధించిన డిజైనింగ్ ప్రక్రియ పూర్తయింది. సుమారు రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి కార్యక్రమంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.ఈ నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిజైనింగ్ పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ ఏజెన్సీ ప్రతినిధులు యూసుఫ్, శ్రీనాథ్‌లతో కలిసి చెరువును పరిశీలించారు. చెరువు అభివృద్ధి ఎలా ఉండాలనే అంశంపై సమగ్రంగా చర్చించారు.చెరువులో గుర్రపు డెక్క అధికంగా పెరగడంతో నాచారం ప్రాంత ప్రజలు దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు.సమస్యను దృష్టిలో ఉంచుకుని చెరువులోని నీటిని తక్షణమే తొలగించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.దీనిపై స్పందించిన ఏజెన్సీ ప్రతినిధులు నీటి తొలగింపుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. గత 3040 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ చెరువుకు ప్రస్తుతం ప్రత్యేక ప్రాధాన్యం లభించడం పట్ల హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్‌తో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## వేలేరు జెడ్‌పీహెచ్ఎస్‌లో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

**వేలేరు, మార్చ్ 17 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద 6వ నుండి 9వ తరగతి వరకు చదువుతున్న క్లాస్ టాపర్ బాలికలకు సైకిళ్లు మరియు ఇతర వస్తువులతో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మరియు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి, బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 480 పాఠశాలలలో 10 పాఠశాలల్లో మన పాఠశాల ఎంపిక కావడం మేనేజర్ కృషికి నిదర్శనమని అభినందించారు. విద్యార్థులు చదువులో మరింత రాణిస్తే భవిష్యత్తులో ఇలాంటి ప్రోత్సాహకాలు మరింతగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తయ్యతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ వర్ధంతి వారోత్సవాలు..

- పోస్టర్ ఆవిష్కరించి ఎస్ఐ వీరేందర్, బొడ్డు మధు

**ఖమ్మం బ్యూరో,మార్చి 17(తెలంగాణ ముచ్చట్లు)**

విప్లవ వీరుడు భగత్సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న భగత్ సింగ్ స్మారక యువజన ఉత్సవాలు జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతకాని ఎస్సై వీరేందర్ భగత్ సింగ్ వారోత్సవాల పోస్టర్ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సమరంలో యువతకు మార్గదర్శకులుగా నిలిచిన భగత్ సింగ్ ఆశలను నేటి యువత ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.





సామాజిక న్యాయం, లౌకికత్వం ,సమానత్వం కోసం పోరాడిన భగత్ సింగ్ త్యాగం భారత యువతకు పూర్తిగా నిర్మిస్తుందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం విద్యారంగంపై దాడులు ప్రజాస్వామ్య హక్కులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో భగత్ సింగ్ ఆలోచనలు నేడు మరింత అవైశక్యంగా మారాయని వారు తెలిపారు. యువత సమాజ మార్పు కోసం చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజానికి పట్టిపీడిస్తున్న గంజాయి డ్రగ్స్ బెట్టింగ్ యాప్స్ తో యువత పెడదొరనులు పడుతున్నారని వాటికి వ్యతిరేకంగా విద్యార్థి యువత నడుం బిగించాలని సూచించారు. మండల కార్యదర్శి గడ్డం విజయ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నిర్వహించనున్న భగత్ సింగ్ స్మారక యువజన ఉత్సవాలలో భాగంగా జిల్లావ్యాప్తంగా సెమినార్లు సంస్కృతిక కార్యక్రమాలు చర్చా వేదికలు యువజన ర్యాలీలు డ్రగ్స్ గంజాయి బెట్టింగ్ యాప్ వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి విద్యార్థులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి అజయ్ గోపి, మండల నాయకులు నందకిషోర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వేణుగోపాల్ తదితరులు ఈ కార్యక్రమాలు పాల్గొన్నారు

# ముస్లిం సోదరులకు అండగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం

- మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు

**ఖమ్మం బ్యూరో, మార్చి 17(తెలంగాణ ముచ్చట్లు)**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదరీ సోదరీమణులకు కానుకగా అందిస్తున్న 'రంజాన్ తోఫా' (బట్టల కిట్లు) పంపిణీ కార్యక్రమం ఎదులాపురం మున్సిపాలిటీలో ఘనంగా జరిగింది. మంగళవారం 8వ వార్డు పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్1, మజీద్ఏఫాతిమా వద్ద ముస్లిం సోదరులకు కిట్లను పంపిణీ చేసి, అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నాయకులు పాల్గొన్నారు.






ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మద్దెలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, 8వ వార్డు కౌన్సిలర్ సంఘాని సుశీల, 13వ వార్డు కౌన్సిలర్ బైరు కోటేశ్వరరావు, మరియు 9వ వార్డు కౌన్సిలర్ కందుకూరి వెంకటనారాయణ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు మాట్లాడుతూ.. పేద ముస్లింలు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ తోఫా కిట్లను అందిస్తోందని తెలిపారు. లౌకికవాదానికి నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాల పండుగలను గౌరవిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్న నాయుడు, పాలేరు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఇంచార్జ్ షేక్ నజీరుద్దీన్, సంఘాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మజీద్ అధ్యక్షులు షేక్ రషీద్, షేక్ హుస్సేన్, షేక్ ముబారక్, షేక్ ముక్రం, షేక్ బాబా మరియు కాలనీవాసులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి నాయకులు ప్రార్థనల్లో పాల్గొని, వారి మధ్య సోదరభావాన్ని చాటుకున్నారు

# భగాయత్‌లో ఎంఎంసీ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం

- రూ.98 కోట్లతో 10 ఎకరాల్లో ఆధునిక భవనం
- స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ ఇంచార్జీలు
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

**ఉప్పల్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ప్రధాన కార్యాలయాన్ని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూసీ నది ఒడ్డున 10 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.98 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో ఈ భవనం నిర్మించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జీలు తెలిపారు.మంగళవారం ఎల్బీనగర్ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్, మేడ్చల్ ఇంచార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి కలిసి భగాయత్‌లో ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, మాజీ బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ధన్పాల్ రెడ్డి, పవని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు సంబంధిత శాఖల అధికారులు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు నేతలు తెలిపారు. ఎంఎంసీ పరిధిలోని ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, మేడ్చల్ నియోజకవర్గాలకు ఉప్పల్ కేంద్రంగా ఉండటంతో ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఉప్పల్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ నేతలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.





# వన్నిగూడలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా రాగుల గణేష్ ముదిరాజ్ ఏకగ్రీవ ఎన్నిక

**కీసర, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):**

కీసర మండలం వన్నిగూడ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సంప్రదాయం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధ్యక్షుడు, కార్యదర్శులను ఎన్నుకునే ప్రక్రియలో భాగంగా ఈ ఎన్నికలు నిర్వహించినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.నూతన అధ్యక్షుడిగా రాగుల గణేష్‌ముదిరాజ్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా రాగుల బాలకృష్ణ, రెడ్డబోయిన మధుకర్ ముదిరాజ్, దేసు పవన్ కుమార్ ముదిరాజ్ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రెడ్డబోయిన మహేష్ ముదిరాజ్, ఖజాంచిగా ఎర్ర వెంకటేష్ ముదిరాజ్ బాధ్యతలు స్వీకరించారు.కార్యదర్శులుగా రాగుల రాజ్ కుమార్ ముదిరాజ్, రెడ్డబోయిన భిక్షపతి, రాగుల లక్ష్మీనారాయణ ముదిరాజ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పల్లెపాటి లక్ష్మయ్య ముదిరాజ్, అబ్రబోయిన వెంకటేష్ ముదిరాజ్, కుక్కదువ్వ భాస్కర్ ముదిరాజ్ ఎంపికయ్యారు.సలహాదారులుగా అంద్యాల బాలకృష్ణ ముదిరాజ్, రాయరపురం రమేష్ ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు రాగుల గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, సభ్యులు మరియు గ్రామస్తుల సహకారంతో గ్రామ అభివృద్ధికి ముందుకు సాగుతామని పేర్కొన్నారు.





# రిటైర్డ్ ఎంఈఓ మోరంపూడి సత్యనారాయణకు మాజీ ఎంపీ నామ నివాళి

**ఖమ్మం బ్యూరో, మార్చి17 (తెలంగాణ ముచ్చట్లు)**

తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఇఓ మోరంపూడి సత్యనారాయణ గారి మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్వగృహానికి చేరుకుని సత్యనారాయణ గారి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం వారి సోదరుడు మోరంపూడి ప్రసాద్ రావు తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరు జీవన్ కుమార్, తల్లాడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీను, దుగ్గిదేవర అజయ్, బీఆర్ఎస్ నాయకులు నాయుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కనకయ్య, శెట్టిపల్లి లక్ష్మణరావు, వెంకటరెడ్డి, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వేలేరు మండలంలో ఆకస్మిక తనిఖీ చేసిన జడ్పీపీ సీఈఓ

**వేలేరు, మార్చ్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** గౌరవ బి. శేషాద్రి, జడ్పీపీ హనుమకొండ సీఈఓ మంగళవారం వేలేరు మండలాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈజీఎస్ పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మరియు మండలంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.పనుల పురోగతిని సమీక్షిస్తూ, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది, ఏపీఓ, ఏఈ (పీఆర్ ), ఏఈ హౌసింగ్ పాల్గొన్నారు.



# కళలు మానసిక ఆనందాన్నిస్తాయి

- పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు

**వనపర్తి,మార్చి17(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెబ్బేర్‌లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో జిల్లా రంగస్థల కళాకారులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పాల్గొని కళాకారులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళలు మరియు సాహిత్యం మనిషికి మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని తెలిపారు. కళ కళ కోసం కాదు, ప్రజల కోసం అన్న నానుడిని అనుసరించి కళాకారులు ప్రజల ఉల్లాసం కోసం తమ ప్రతిభను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.గత యాభై సంవత్సరాలుగా సరస్వతీ కళా సమితి ద్వారా పెబ్బేర్ కళాకారులు పౌరాణిక, జానపద, చారిత్రక నాటకాలను ప్రదర్శిస్తూ రంగస్థల కళకు సేవలందించడం అభినందనీయమని కొనియాడారు .ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్. ఉమామహేశ్వర్, కార్యదర్శి సర్వారెడ్డి, సితార వెంకటేశ్వర్లు తదితరులను శాలువాలు, జ్ఞాపకాలతో సత్కరించారు.కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, రాములు, గోవర్ధన్ చారి, శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.




# బోగ్గారపు రామయ్యకుటుంబసభ్యులకు మాజీ ఎంపీ నామ పరామర్శ

**ఖమ్మం బ్యూరో, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం కార్పొరేషన్, ఇల్లందు రోడ్ లోని ప్రగతి ప్రైడ్ కాలనీకి చెందిన బొగ్గారపు రామయ్య ఇటీవల మరణించిన విషయం విధితమే కాగా మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వారి స్వగృహానికి వెళ్లి రామయ్య చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు. రామయ్య అల్లుడు మందటి నరేష్ చౌదరి, కుమార్తె కౌముదిని, కుమారులు రణధీర్, అభినవ్ తో పాటు వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ నామ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్ తో పాటు పొట్ల హరినాధ్ బాబు, మాజీ పిఏసీఎస్ చైర్మన్ మన్నే బాలకృష్ణ, గుంటుపల్లి రఘు బాబు, యనమద్ది రాధాకృష్ణ, దేవభక్తని హేమంత్, బీఆర్ఎస్ నాయకులు వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# రైతు భరోసా కు దరఖాస్తు చేసుకోండి..

- వైరా మండల వ్యవసాయ శాఖ అధికారి మయాన్ మంజుఖాన్

**ఖమ్మం బ్యూరో, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు)**



వైరా మండలంలో ఏసంగి సీజన్కు గాను 395 కొత్త పాస్ పుస్తకాలు వచ్చాయి, వీరందరూ రైతు భరోసా కొరకు దరఖాస్తు చేసుకోవాలని 28 22026 నాటికి పాసుబుక్ వచ్చిన వారు ఈ పథకానికి అర్హులు, అర్హులైన రైతులు రైతు భరోసా అప్లికేషన్ ఫారం, పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్ , ఆధార్ జిరాక్స్, బ్యాంకు ఖాతా జిరాక్స్ దరఖాస్తు పూర్తి చేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి మార్చి 25వ తారీకు వరకు దరఖాస్తులు సమర్పించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ముయాన్ మంజుఖాన్ రైతులకు సూచించారు.

# పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యసాధ్యం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శివశంకర్

- ఎన్ఎస్ఎస్ ముగింపు కార్యక్రమంలో యువతకు ప్రేరణ
- ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పన

**కుషాయిగూడ, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** పట్టుదలతో కృషి చేస్తే అనుకున్న గమ్యాన్ని సాధించవచ్చని జవహర్ నగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శివశంకర్ గౌడ్ పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) కార్యక్రమం ముగింపు సందర్భంగా కాప్రా సర్కిల్ పరిధిలోని జై జీవన్ కాలనీ శ్రీ విశ్వకర్మ ట్రస్ట్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షుడు, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, విశ్వకర్మ ట్రస్ట్ చీఫ్ అడ్వైజర్ లయన్ జ్యోతిర్మయాచారి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా కుషాయిగూడ, జై జవాన్ కాలనీ, కాప్రా, ఈసీఐఎల్ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ అవగాహన, స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణపై పలు కార్యక్రమాలు నిర్వహించారు.




ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, ఓటమిని చూసి నిరాశ చెందకుండా గెలుపు కోసం కృషి చేయాలని యువతకు సూచించారు. ట్రాఫిక్ భద్రతపై మాట్లాడుతూ సెల్ ఫోన్‌లపై చూపే శ్రద్ధను హెల్మెట్ ధారణపై కూడా చూపాలని అన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. యువతతో సాధ్యం కానిదేమీ లేదని పేర్కొన్నారు.లయన్ జ్యోతిర్మయాచారి మాట్లాడుతూ విద్య అనేది సర్టిఫికెట్లకే పరిమితం కాకుండా విలువలతో కూడినదై ఉండాలని చెప్పారు. మానవీయ విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ సబ్ ఇన్స్పెక్టర్ వెంకన్న, ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కరుణాసాగర్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమాదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్, ప్రొఫెసర్ డాక్టర్ నరేష్, ఏఎస్ఐ గోపాల్ గౌడ్, విశ్వకర్మ ట్రస్ట్ చైర్మన్ కలకొండ బిక్షపతి, స్థల దాత మారోజు నరసింహ చారి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# 2 బిహెచ్‌కె కాలనీల్లో 992 వాణిజ్య సముదాయాల వేలం

- మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లాలో మార్కెట్ రేటుతో కనీస ధర నిర్ణయం
- మార్చి నెలాఖరు వరకు ప్రక్రియ పూర్తి

**మేడ్చల్–మల్కాజ్గిరి, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని 2 బిహెచ్‌కె కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను వేలం పద్ధతిలో విక్రయించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించింది. మొత్తం 16 కాలనీలలోని 992 వాణిజ్య సముదాయాలను మార్చి నెలాఖరు వరకు వేలం వేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో వివిధ మున్సిపల్ శాఖల అధికారులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రతినిధులు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ అధికారులు పాల్గొన్నారు.




ఈ సందర్భంగా వాణిజ్య సముదాయాల చదరపు అడుగుకు మార్కెట్ విలువను పరిశీలించి, అదే ధరను కనీస ధరగా నిర్ణయించాలని సూచించారు. వేలంలో పాల్గొనే వారు 3% నుంచి 10% వరకు ముందస్తు హామీ సొమ్ము (ఈఎండి) చెల్లించేలా మార్గదర్శకాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.వాణిజ్య సముదాయాల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆయా 2 బిహెచ్‌కె కాలనీల అభివృద్ధి పనులకే వినియోగించాల్సిన నిబంధనలు ఉన్నట్లు తెలిపారు.అలాగే కనీస ధర నిర్ణయానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ కన్వీనర్‌గా, అడిషనల్ కలెక్టర్, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సభ్యులుగా ఉండే కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు.

# స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు


**ఖమ్మం బ్యూరో,మార్చి 17(తెలంగాణ ముచ్చట్లు)** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో మంగళవారం ముందస్తు రంజాన్ పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పాఠశాల చిన్నారులు తమ మిత్రులకు ఈద్ ముబారక్ అంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఒకరికొకరు ఖర్జూరాలు,పండ్లు, సేమియాలు అందించి తమ ఆత్మీయ అనుబంధాన్ని చాటారు. మతసామరస్యానికి ప్రతీకగా పాఠశాలలో అన్ని తరగతుల విద్యార్థులు రంజాన్ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రపంచమంతటా మతసామరస్యాన్ని చాటుతూ రంజాన్ వేడుకలను నిర్వహించి తోటి మానవుల పట్ల తమ ఆదరాభిమానాలను ప్రదర్శించే పండుగ రంజాన్ పర్వదినం అని పేర్కొన్నారు. కఠోర ఉపవాసాన్ని ఆచరించి చివరి రోజు ఈద్‌ఉల్ ఫితర్ పర్వదినాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు. రంజాన్ మాసంలోనే పవిత్ర ఖురాన్ మత గ్రంథం దివి నుంచి భూమికి చేరిన పవిత్ర మాసం అని తెలియజేశారు. ఓర్పు,సహనం, త్యాగనిరతి,పరోపకారం ,దానధర్మ భావనలు రంజాన్ పర్వదినం మనకి అందరికీ సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# పులిగుండాల ప్రాజెక్టు నీటి విడుదలకు మంత్రి తుమ్మల ఆదేశం

- పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన
- తక్షణ స్పందనతో రంగంలోకి దిగిన మంత్రి
- యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసిన మంత్రి

**ఖమ్మం బ్యూరో, మార్చి 17(తెలంగాణ ముచ్చట్లు)** పెనుబల్లి మండలం లోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మలకుంట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన మంత్రి, ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి



సుమారు 1000 ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ఈ మేరకు మంత్రి తుమ్మల ప్రాజెక్టు పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి, రెవెన్యూ మరియు ఫారెస్ట్ శాఖల సమన్వయంతో వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన దిశా నిర్దేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థతో మంత్రి నేరుగా ఫోన్‌లో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని, రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే నీటిపారుదల శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి విడుదలను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పరిస్థితి అత్యవసరంగా ఉన్నందున ఫీల్డ్ స్థాయిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
రైతుల పంటలను ఎండిపోకుండా కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రతి రైతుకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు ప్రాణాధారం లభించనుందని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో అధికారులు వేగంగా స్పందించి నీటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కమలానగర్‌లో ఘనంగా పుస్తకాల ఆవిష్కరణ సభ

- రాంశెట్టి రోశయ్య, బంగారు ఆచార్యుల ఐదు పుస్తకాల విడుదల
- సాహిత్యవేత్తల సమక్షంలో స్ఫూర్తి గ్రూపు ఆధ్వర్యంలో కార్యక్రమం

**కమలానగర్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూపు ఆధ్వర్యంలో కమలానగర్ సిఐటియు కార్యాలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి పుస్తకాల ఆవిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత రాంశెట్టి రోశయ్య రచించిన మూడు పుస్తకాలు, బంగారు వి.బి ఆచార్యులు రచించిన రెండు పుస్తకాలు ఆవిష్కరించారు.సమాచార హక్కు సాధన నాయకులు గగన్ కుమార్ ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించగా, ప్రముఖ రచయిత కె. ఆనందాచారి, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, రచయిత్రి పి. జ్యోతి, స్ఫూర్తి గ్రూపు బాధ్యులు గొడుగు యాదగిరిరావు, రచయిత బంగారు ఆచార్యులు, వ్యాఖ్యాత పద్మావతి తదితరులు వేదికను అలంకరించారు. కార్యక్రమానికి ముందుగా రుక్కయ్య ఆలపించిన ప్రారంభ గీతం ఆకట్టుకోగా, నవతెలంగాణ రవి, చల్లా





లీలావతి బృందం పాటలు సభను ఉత్సాహభరితంగా మార్చాయి.సభకు అధ్యక్షత వహించిన పి. జ్యోతి మాట్లాడుతూ రాంశెట్టి రోశయ్య వందేళ్లు దాటినా రచనా వ్యాసంగాన్ని కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. బంగారు ఆచార్యులు అభ్యుదయ భావాలతో సాహిత్య రంగానికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు.ఈ సందర్భంగా రోశయ్య రచించిన "ప్రపంచీకరణ", "నాదే కులం", "నానీలు" పుస్తకాలను కె. ఆనందాచారి ఆవిష్కరించగా, బంగారు ఆచార్యులు రచించిన "దీపశిఖ", "దృష్టికోణం" పుస్తకాలను మౌనశ్రీ మల్లిక్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడిన ఆనందాచారి, రోశయ్య ప్రజా ఉద్యమాలతో మమేకమై ప్రజా సమస్యలపై విస్తృతంగా రచనలు చేశారని తెలిపారు.మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ స్ఫూర్తి గ్రూపు నాయకులు గొడుగు యాదగిరిరావుతో ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ సాహిత్య, సామాజిక రంగాల్లో కలిసి ముందుకు సాగుతున్నామని చెప్పారు. బంగారు ఆచార్యులు శ్రామిక భావాలతో రచనలు చేస్తున్న కవిగా అభివర్ణించారు.పుస్తకాల పరిచయాన్ని గొడుగు యాదగిరిరావు, పద్మావతి సమగ్రంగా నిర్వహించగా, సభలో గద్దల నరసింహారావు, వి.వి వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.ఈ సందర్భంగా కె. ఆనందాచారి, పి. జ్యోతి, బంగారు ఆచార్యులు, పద్మావతి, రుక్కయ్య, నవతెలంగాణ రవి తదితరులను చేనేత వస్త్రాలతో సత్కరించారు. చివరగా జయరాజు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమం విజయవంతానికి రోశయ్య మనవడు చైతన్య సహకారం అందించారు.

## శ్రీ ఆదర్శ విద్యార్థికి జవహర్ నవోదయలో సీటు

**ఖమ్మం బ్యూరో, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు)**



చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ హై స్కూల్ లో ఐదవ తరగతి చదువుతున్న లింగం భువనేశ్వరి జవహర్ నవోదయలో సీటు సాధించింది. జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు దేశవ్యాప్తంగా డిసెంబర్ 13న జరిగాయి. ఈరోజు పరీక్ష ఫలితాలు వెలుబడ్డాయి. ఈ పరీక్షలో లింగం భువనేశ్వరి అత్యంత ప్రతిభ కనపరిచి 88.75 మార్కులతో జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించింది. భువనేశ్వరి తండ్రి లింగం కొండలరావు నాగులవంచలో ఓ ఎరువుల దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల మేనేజ్మెంట్ , ఉపాధ్యాయులు అభినందించారు.



## జంగమయ్యపల్లిలో మధుమేహ రోగులకు ఉచిత నేత్ర రెటినోపతి పరీక్షలు

**పెద్దమందడి,మార్చి17(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం జంగమయ్య పల్లి గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ మరియు ఆరోగ్య వైద్యాధికారి ఆదేశాల మేరకు డయాబెటిక్ రెటినోపతి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా శిబిరం ఇంచార్జి డా. తార శశాంక మాట్లాడుతూ, డయాబెటిక్ రెటినోపతి స్క్రీనింగ్ ద్వారా షుగర్ పేషెంట్లలో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు.సమయానికి పరీక్షలు చేయించుకోకపోతే చూపు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు.గ్రామ సర్పంచ్ జ్యోతి నాగరాజు మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డా. వీణా, డా. సాయి ప్రసాద్, గ్రామ సెక్రటరీ, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరమ్మ, సిబ్బంది రాము, సతీష్, ఆప్టొమెట్రిస్ట్ యామిని తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యారు.



### ఆడబిడ్డ పెళ్లికి సర్పంచ్ కానుకగా రూ.5,116 అందజేసిన

## సర్పంచ్ అనిత నరసింహారావు

**వేలేరు, మార్చ్ 17 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన జల్తారీ సంపత్-స్వరూపల ద్వితీయ పుత్రిక వర్షిత-నరేష్‌ల వివాహం నిన్న నిర్వహించబడింది. సర్పంచ్ , ఈ రోజు పీచరలోని వారి స్వగృహానికి వెళ్లి రూ.5,116/లను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరిజే అనిత-నర్సింహరావు మాట్లాడుతూ, ఆడబిడ్డ పెళ్లికి తమవంతు సహాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుడికందుల ప్రశాంత్, వార్డు సభ్యులు గుడికందుల రాకేష్, BRS పార్టీ నాయకులు అవునురి శ్యామ్, మహమ్మద్ హరీఫ్, మండల ఉమా, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- రడపాక డానియెల్,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు

**హైదరాబాద్,మార్చి17 (తెలంగాణ ముచ్చట్లు):**



హైదరాబాద్ బోడుప్పల్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు నివాసంపై జరిగిన దాడి ఘటనను స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రడపాక డానియల్ ఖండించారు. ఈ ఘటన అనవసర ఉద్రిక్తతలకు దారితీసే విధంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు.మందుల సామేలు చేసిన వ్యాఖ్యలను కారణంగా చూపుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. చిన్న విషయాలను పెద్దగా చేసి గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి చర్యలు సమాజంలో విభేదాలను పెంచుతాయని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలు రేకెత్తించడం తగదని, శాంతి, సామరస్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని రడపాక డానియల్ పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మందుల సామేలు కు మద్దతుగా నిలుస్తామని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మేడ్చల్ కలెక్టరేట్‌లో ఎన్డీఆర్ఎఫ్ మాక్ డ్రిల్ నిర్వహణ

- కెమికల్ ప్రమాదాలు, బాంబ్ బ్లాస్ట్‌లకు స్పందనపై అవగాహన

**మేడ్చల్–మల్కాజ్గిరి, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):**





జిల్లాలోని కర్మాగారాలు, పరిశ్రమల్లో జరిగే కెమికల్ బ్లాస్ట్‌లు, లీకేజీలు, అలాగే బాంబ్ పేలుళ్ల వంటి అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈ మాక్ డ్రిల్‌లో ప్రమాద సమయంలో గాయపడిన వారిని ఎలా రక్షించాలి, కాలుష్య ప్రభావాన్ని ఎలా తగ్గించాలి, పరిస్థితులను ఎలా నియంత్రించాలి వంటి అంశాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. కెమికల్ బ్లాస్ట్‌ల వల్ల విడుదలయ్యే వాయువుల ప్రభావాన్ని అంచనా వేసి పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలను ఎన్డీఆర్ఎఫ్ అధికారి గౌతం కుమార్ వివరించారు.
ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించే విధానం, ఫీల్డ్ ఆపరేషన్లలో వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంత ముఖ్యమో తెలిపారు. ప్రమాద స్థలాల్లో సిబ్బంది ఎక్కువసేపు పనిచేయాల్సి ఉండటంతో రక్షణ కోసం ప్రత్యేక కిట్లు, మాస్కులు, గ్లౌజులు, ప్రొటెక్టివ్ డ్రెస్సులు ఉపయోగించడం అవసరమని వివరించారు.ఇలాంటి ఘటనల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై కూడా ఎన్డీఆర్ఎఫ్ బృందం అవగాహన కల్పించింది. మాక్ డ్రిల్‌లో క్లోరిన్ రసాయనం లక్షణాలు, దాని ప్రభావాలపై సవివరంగా వివరించారు.ఈ కార్యక్రమం ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ, కర్మాగారాలు, వైద్య విభాగాల సమన్వయంతో నిర్వహించబడింది.ఈ మాక్ డ్రిల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు డీసీపీలు వెంకట్ రెడ్డి, హనుమంతరావు, డిఆర్ఓ చంద్రావతి, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్ల ఆందోళన ఉద్రిక్తం

- పోలీసుల అడ్డంకులతో ఉద్రిక్త పరిస్థితి
- సీఐటీయూ నాయకుల అరెస్టులు
- ఫిక్స్డ్ వేతనాలపై ప్రభుత్వంపై ఆగ్రహం

**మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):**






మేడ్చల్ కలెక్టరేట్ వద్ద తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. తమ సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్లు భారీగా చేరుకుని నిరసన చేపట్టగా, పోలీసులు అడ్డుకోవడంతో తోపులాటలు చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పలువురు ఆశా వర్కర్లతో పాటు సీఐటీయూ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని బొల్లారం, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు.
ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. గత 20 ఏళ్లుగా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీసం రూ.18,000 ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించి, ఇతర ఖర్చుల కోసం రూ.50,000 మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని డిమాండ్ చేశారు.సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్ మాట్లాడుతూ, ఆశా వర్కర్ల శ్రమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆశలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.పోలీసుల నిర్బంధాలను ఛేదించి 48 గంటల నిరసనలో పాల్గొన్న ఆశా వర్కర్లు తమ సమస్యలను కలెక్టరేట్‌కు విన్నవించేందుకు వెళ్లగా, అక్రమంగా అరెస్టు చేశారని నాయకులు ఆరోపించారు. అరెస్టులతో ఉద్యమాలను అణచలేరని హెచ్చరిస్తూ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా నాయకులు రేవతి, అనిత, ఐ. రాజశేఖర్, బి. లింగస్వామి, పి. గణేష్, ఆర్. సంతోష్, ఎం. నరేష్, శంకరమ్మ, రమ, సబియా, పద్మ, వసంత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# చిలుకటోనిపల్లి వాగులో రాత్రివేళ అక్రమ ఇసుక రవాణా

- ఇద్దరిపై కేసు నమోదు, ట్రాక్టర్లు స్వాధీనం

**పెద్దమందడి,మార్చి17(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరిపై పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జలంధర్ రెడ్డి తెలిపారు.వివరాల్లోకి వెళితే... మార్చి 16, 2026 తెల్లవారుజామున పెద్దమందడి మండల పరిధిలోని చిలుకటోనిపల్లి వాగు నుండి రాత్రి సమయంలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రెండు ట్రాక్టర్లలో తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా చిలుకటోనిపల్లి గ్రామానికి చెందిన భాజ శీను మరియు కనిమెట్ట గ్రామానికి చెందిన బోయ సుధాకర్ అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారి పై కేసు నమోదు చేసి, ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జలంధర్ రెడ్డి తెలిపారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జలంధర్ రెడ్డి హెచ్చరించారు.




# పామిరెడ్డిపల్లిలో రంజాన్ ఇఫ్తార్ విందు – సర్వమత సామరస్యానికి నిదర్శనం

**పెద్దమందడి,మార్చి17(తెలంగాణ ముచ్చట్లు):**





పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందును గ్రామ కాంగ్రెస్ నాయకులు మధిర శ్రీశైలం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రంజాన్ పండుగ ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు.సర్వ మానవాళి శ్రేయస్సు కోసం 30 రోజులపాటు ఉపవాస దీక్ష చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈ పండుగను సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిక్కన్న సిద్దయ్య, మాజీ ఎంపిటిసి ఇంద్ర లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు రాములమ్మ, నరేష్, లక్ష్మి, రాజ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అంగన్వాడి కేంద్రంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

- అంగన్వాడి కేంద్రం కి విద్యుత్ సరఫరా
- పరిసరాలు పరిశుభ్రతగా ఉండాలి*
- మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణా

**ఖమ్మం బ్యూరో,మార్చి 17(తెలంగాణ ముచ్చట్లు)**



వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో విద్యుత్ మీటర్ ను మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మంగళవారం వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి కి విద్యుత్ శాఖ డీఈ రమేష్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణా మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం అభివృద్ధికి కౌన్సిలర్ వరలక్ష్మి కృషి చేస్తున్నారు. ఇటీవల ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా వార్డులో పర్యటించిన జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ దృష్టికి కౌన్సిలర్ వరలక్ష్మి అంగన్వాడి కేంద్ర సమస్యలను వివరించారు. అందులో భాగంగా మంగళవారం అధికారులు అంగన్వాడి కేంద్రానికి కావలసిన విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లకు సంబంధించిన వస్తువులను తీసుకురావడం జరిగిందని ఆమె అన్నారు, అంగన్వాడి కేంద్రం పావురంలో శుభ్రత అవసరమని పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చైర్ పర్సన్ చంద్రకళ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణా, ఉండ్రు శ్యామ్ బాబు ,మాజీ కౌన్సిలర్ గూగులోత్ లక్ష్మీబాయి, పొదిలి హరినాథ్ తేజ వత్ నాగేశ్వరావు, గుగులోత్ విజయ్, తాడి రాజు, పృధ్వి, లైన్ ఇన్స్పెక్టర్ జార్జి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## సత్తుపల్లి బార్ అసోసియేషన్‌కు నూతన కమిటీ!

- అధ్యక్షుడిగా కూకలకుంట రవి ఏకగ్రీవ ఎన్నిక



**సత్తుపల్లి, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పడింది. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది కూకలకుంట రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా సాధు కృష్ణయ్య, జాయింట్ సెక్రటరీగా వంకదారు రామకృష్ణ, కోశాధికారిగా కొప్పుల కేశవరెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా నల్లగట్ల విజయకుమార్ ఎంపికయ్యారు. స్పోర్ట్స్ గేమ్స్ కార్యదర్శిగా జేవీ నరేంద్ర, మహిళా ప్రతినిధిగా ఎస్‌కే జీనత్ హస్సీనా ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా గుంట్రు శ్రీనివాసరావు, మోదుగు నరేష్‌లను ఎన్నుకున్నారు. తెలంగాణ బార్ అసోసియేషన్ విడుదల చేసిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 26న ఎన్నికలు జరగాల్సి ఉండగా, సత్తుపల్లిలో ఈ నెల 9 నుంచి 11 వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. 16న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీ లేకపోవడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఖరారైంది. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎస్. లక్ష్మణరావు వ్యవహరించారు. కాగా, ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక ఈ నెల 26న నిర్వహించనున్నారు. నూతన కార్యవర్గం ఏప్రిల్ 1 నుంచి ఏడాది కాలం పాటు బాధ్యతలు నిర్వహించనుంది.

## తెలంగాణలో బంజారాలకు అన్యాయం

- ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మోహన్ సింగ్



**హన్మకొండ,మార్చి17(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో బంజారాలకు అన్యాయం జరిగిందని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మోహన్ సింగ్, ప్రధాన కార్యదర్శి బిస్కి నాయక్ ఆరోపించారు. రాష్ట్రంలో గణనీయమైన జనాభా కలిగిన బంజారా సమాజం రాజకీయంగా కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని తెలిపారు.ఇటీవల ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీలో బంజారా వర్గానికి ఒక్క ప్రతినిధికి కూడా అవకాశం ఇవ్వకపోవడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో బంజారా సమాజం ముఖ్యమైన పాత్ర పోషించినప్పటికీ, ఆ కృషికి తగిన గుర్తింపు లభించలేదని అన్నారు.

మంత్రివర్గంలో కూడా బంజారా వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల సమాజంలో అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. రాజకీయంగా కీలకమైన వర్గాన్ని పక్కన పెట్టడం సమంజసం కాదని, ఇది భవిష్యత్తులో ప్రతికూల పరిస్థితులకు దారితీసే అవకాశముందని హెచ్చరించారు. బంజారా సమాజానికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం, వారి కృషిని గౌరవించడం అవసరమని, ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలని డిమాండ్ చేశారు. లేదంటే బంజారా సమాజం తమ హక్కుల కోసం పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని స్పష్టం చేశారు.



## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు పితృవియోగం

**మహబూబాబాద్,మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి జాటోత్ లచ్చా నాయక్ (95) కన్నుమూశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు.

లచ్చా నాయక్ పార్థివ దేహాన్ని పలువురు నాయకులు, బంధుమిత్రులు సందర్శించి పూలమాలలు అర్పిస్తూ నివాళులు ఘటించారు. ఈ సందర్భంగా బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ఎన్ నాయక్, భానోత్ వెంకన్న, బాదావత్ బాలాజీ, రామన్న, జాటోత్ కిషన్ నాయక్, రాష్ట్ర ట్రైబల్ జర్నలిస్టు యూనియన్ సంయుక్త కార్యదర్శి లావుడియా పల్లవి రాజు నాయక్, పోరిక రమేష్‌నాయక్, ప్రొఫెసర్ మూడు రమేష్, సీనియర్ జర్నలిస్ట్ భూక్య శ్రావణ్ కుమార్ తదితరులు నివాళులు అర్పించారు.అనంతరం జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కలిసి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అంత్యక్రియలలో కూడా పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.లచ్చా నాయక్ మృతి పట్ల పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎల్కతుర్తి మండల బిజెపి అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్



**ఎల్కతుర్తి, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు.

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఎల్కతుర్తి మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తిగా గాలికి వదిలేసిందని ఆరోపించారు.

నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో రైతులకు ఎకరాకు ₹6000 పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు.

అలాగే యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం, కళ్యాణ లక్ష్మి, గృహ నిర్మాణ పథకం, రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి కీలక హామీలు అమలులోకి రాకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు.

మండలంలోని రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందకపోవడంతో అప్పులపాలవుతున్నారని తెలిపారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లు అందకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని, భూభారతి రెవెన్యూ సదస్సులో సమర్పించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. అదేవిధంగా ఆదాయం, కుల, నివాస ధృవీకరణ పత్రాల జారీ లో జాప్యం జరుగుతోందని, అర్హులైన వారికి సమయానికి ధృవీకరణ పత్రాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనగాం కిష్టయ్య, ఆడెపు శ్రీ వర్ధన్, చిదూరల వెంకటేష్, పల్లెపాటి మధుకర్, బీట్ల లింగయ్య, కోడం రమేష్, ఠాకూర్ శంసింగ్, వంగ రమేష్, కొలిపాక శ్రీనివాస్, కనుకుంట్ల రమణాచారి, మాట్ల విద్యాసాగర్, సూది రెడ్డి సాయికృష్ణ, దాసరి సాయి తేజ, సప్పిరాజు, చిర్ర శ్రీనివాస్, పోలు శివ, నాంపల్లి విష్ణువర్ధన్, నన్నబోయిన సంపత్, హింగే దేవరావు, తక్కాలపల్లి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ డిమాండ్



**ధర్మసాగర్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర స్థాయి పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ ధర్మసాగర్ మండల నాయకులు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు హామీలను తక్షణమే పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల రెవెన్యూ అధికారి సదానందంకు వినతిపత్రం సమర్పించారు.మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే హామీలను స్పష్టమైన కార్యాచరణతో అమలు చేయాలని, ఇందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్ల నిరాశ నెలకొంటోందని, ప్రభుత్వం వాటి అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన గ్యారెంటీలను వాయిదా వేయకుండా దశలవారీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ కదుగాయ రమేష్, మండల ప్రధాన కార్యదర్శి సాయం సందీప్, మండల ఉపాధ్యక్షుడు మోర్ రాజేందర్, బీజేవైఎం అధ్యక్షుడు గాజా శ్యాంసుందర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మాచర్ల అనిరుధ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పెసరు వెంకటేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గంగారపు రమేష్, సీనియర్ నాయకులు దుస్సా రాములు, సాంబరాజు, శ్రీదర్, సంపత్, వెంకన్న, గట్టుమళ్ళ తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటలో తాలు గింజలు.. రైతులకు గట్టి దెబ్బ

- 50%కు పైగా నష్టమంటూ రైతుల ఆవేదన వెల్లడి.
- ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా) రకంపై రైతుల అసంతృప్తి.



**సత్తుపల్లి, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం సిద్ధారం గ్రామానికి చెందిన రైతులు రాష్ట్ర యువ నాయకుడు డాక్టర్ తుమ్మల యుగంధర్‌ను కలిసి తమ గోడును వినిపించారు. రబీ సీజన్‌లో శ్రీరామ్ సీడ్స్ కంపెనీకి చెందిన ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా) రకం వరి విత్తనాలతో సాగు చేసినట్లు తెలిపారు.

రైతుల వివరాల ప్రకారం, పంట మొదట బాగానే పెరిగినప్పటికీ, వరి ఈనిన తర్వాత 50 శాతం పైగా తాలు గింజలు కనిపించాయని తెలిపారు. మంచి దిగుబడి ఆశించి పెట్టుబడులు పెట్టిన తమకు ఈ పరిస్థితి తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు ఇలా అన్ని విధాలా భారీగా ఖర్చు చేసినప్పటికీ, నాణ్యమైన ధాన్యం రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నమ్మకంతో కొనుగోలు చేసిన విత్తనాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తాలు గింజలు అధికంగా రావడానికి కారణాలను గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ తుమ్మల యుగంధర్‌ను విజ్ఞప్తి చేశారు.





## ప్రజల మధ్య ఐక్యత భావం పెంచుతున్న 'ఇఫ్తార్'

- సమాజంలో శాంతిని నెలకొల్పుతున్న పవిత్ర రంజాన్ మాసం
- రంజాన్ మాస స్ఫూర్తితో రాగద్వేషాలు దూరం చేసుకోవాలి
- మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం
- మధిర రిక్రియేషన్ క్లబ్బులో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

**ఖమ్మం బ్యూరో, మార్చి 17(తెలంగాణ ముచ్చట్లు)** మతసామరస్యాన్ని చాటుతూ విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అందుకు పండుగలు దోహదపడతాయని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం అన్నారు.పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని రీక్రియేషన్ క్లబ్బులో ఇఫ్తార్ విందు కార్యక్రమానికి,మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్,ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకట రమణ గుప్తా, మైనార్టీ కౌన్సిలర్ షేక్ రసీదున్ పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో చైర్మన్ సామినేని సుజాత ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో చైర్మన్ సామినేని సుజాత మాట్లాడుతూ,ప్రజల ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ ప్రభుత్వం పండుగల సమయాల్లో అధికారిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.ప్రభుత్వం మన సోదరులకి ఇచ్చే ఆత్మీయ ఇఫ్తార్ విందులో హిందూ ముస్లింలు కలిసి పాల్గొనడం చూస్తుంటే ఒక పెద్ద కుటుంబం ఇక్కడికి చేరి పండగ చేసుకున్నట్లుంది అని అన్నారు.ఐక్యత అంటే ఇదే ప్రజలందరూ కలిసి ఐక్యమత్యంగా అన్ని పండుగలు ఇలాగే జరుపుకోవాలి అన్నారు.ఈ ప్రభుత్వం మనది,నేను మీ ఇంటి ఆడబిడ్డని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో మనమందరం కలిసి అభివృద్ధిలో మధిరను ముందుకు తీసుకువెళదాం... అందుకు మన ప్రభుత్వం కోసం,మన మధిర కోసం మీ ప్రార్థనలు చాలా అవసరం మీరు ప్రార్థించాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## కాంగ్రెస్ హామీల అమలు కోరుతూ బీజేపీ నిరసన

**స్టేషన్ ఘనపూర్,మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని చిల్పూర్ మండలంలో ఈ ఆందోళన నిర్వహించారు.మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు సమర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా పార్లమెంట్ కో కన్వీనర్ యుగేందర్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బాల్నే శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యదర్శి వల్లాల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

యువతకు నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పి అమలు చేయకపోవడం నిరాశ కలిగించిందని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడంతో పాటు కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు మంజూరు చేయాలని, రైతులకు భరోసా నిధులు విడుదల చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, కళ్యాణలక్ష్మి పథకం కింద అర్హులకు ఆర్థిక సహాయం అందించాలని కూడా వారు డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు వెలిశాల శ్రీనివాస్, కందుకూరి రాజనీకర్, ఉరడి రాజు, తోట రంజిత్, శైలేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.







# భవన నిర్మాణ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహణ

**మడికొండ,మార్చి 17(తెలంగాణ ముచ్చట్లు):** భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో మడికొండలో కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్మిక రత్న, శ్రమ శక్తి అవార్డు గ్రహీత గిన్నారపు మహేందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి, రాష్ట్ర కార్యదర్శి రసమల్ల కొమురయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పానుగంటి కాలేబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు కార్మిక సంఘాలు అన్నీ ఏకమై పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాలపై సమిష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు కార్మిక కోడ్స్ కార్మిక సంక్షేమానికి అనుకూలంగా లేవని, దేశవ్యాప్తంగా నిర్వహించిన నిరసనలు, భారత్ బంద్‌కు పిలుపులు ఇచ్చినా ఆశించిన ఫలితం రాలేదని పేర్కొన్నారు. చరిత్రలో కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు జరిగాయని, అనేక మంది తమ ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. గతంలో అమలులో ఉన్న కార్మిక చట్టాలను ఎలాంటి ప్రభుత్వాలు నిర్వీర్యం చేయలేదని, ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వ విధానాలు కార్మికులకు నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. అన్ని సంఘాలు ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కుల కోసం పోరాడాలని సూచించారు. ప్రతి గ్రామంలో సంఘాలను బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ మహాసభలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 30న జనగామలోని జూబ్లీ ఫంక్షన్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారు నాయిని రామస్వామి, రాష్ట్ర నాయకుడు అలువల ఎల్లయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నాగిళ్ళ రాజు, దామెర బాలనర్సయ్య, జిల్లా కార్యదర్శులు నిర్మల సత్యం, పోకల శ్రీవాస్, జారిపోతుల రాజు, రోడ్డ రాజు, తాండ్ర రాములు, బాధింటి బాబు, తిప్పరపు రామచంద్రం, ఉడుగుల యాదగిరి, గాదె అశోక్, నిరడి వీరస్వామి, తిప్పరపు ఉప్పలయ్య, కుంతి రామనార్సయ్య తదితరులు పాల్గొన్నారు.




# భారత తీరానికి చేరిన ఎల్పీజీ నౌకల సిబ్బందితో భేటీ

- షివాలిక్, నందా దేవి నౌకల సిబ్బందిని అభినందించిన అధికారులు
- హోర్ముజ్ జలసంధి మార్గంలో సురక్షిత ప్రయాణంపై ప్రశంసలు
- సముద్ర రవాణా భద్రతకు భారత్ కట్టుబాటు

**న్యూఢిల్లీ:** భారత జెండాతో నడిచే ఎల్పీజీ నౌకలు షివాలిక్, నందా దేవి సురక్షితంగా భారత తీరాలకు చేరుకున్న అనంతరం వాటి సిబ్బందితో అధికారులు సమావేశమయ్యారు. పర్షియన్ గల్ఫ్ మరియు వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన హోర్ముజ్ జలసంధి మార్గంలో ప్రయాణించిన ఈ నౌకల సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణను అధికారులు అభినందించారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో సముద్ర మార్గాల్లో భద్రత అత్యంత కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి వంటి వ్యూహాత్మక మార్గాల్లో సురక్షిత ప్రయాణం కోసం అప్రమత్తత, సమన్వయం, బాధ్యతాయుత వ్యవహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ నౌకల సిబ్బంది చూపిన నిబద్ధత సముద్ర రవాణా భద్రతకు మంచి ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. భారత దేశం తన సముద్ర సిబ్బంది భద్రత, సంక్షేమానికి ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని అధికారులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గాల్లో పని చేస్తున్న భారతీయ నావికుల భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ సముద్ర రవాణా రంగాన్ని మరింత సురక్షితంగా, సమర్థవంతంగా కొనసాగించేందుకు కట్టుబడి ఉందని అధికారులు స్పష్టం చేశారు. ప్రపంచ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించే సముద్ర మార్గాల భద్రతకు భారత్ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

# అమెరికాకు ఇరాన్ హెచ్చరిక.. 'మరో వియత్నాం యుద్ధం ఎదుర్కోవాలి'

- ఖర్గ్ దీవిపై అమెరికా చర్యల నేపథ్యంలో ఉద్రిక్తత
- అమెరికా దళాలు అడుగుపెడితే తీవ్ర ప్రతిఘటన అంటూ హెచ్చరిక
- ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడి చేసిన ఇరాన్



**టెహ్రాన్:** ఖర్గ్ దీవిపై అమెరికా చేపడుతున్న సైనిక చర్యల నేపథ్యంలో అమెరికాకు ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఒకవేళ అమెరికా బలగాలు ఇరాన్ భూభాగంలో అడుగుపెడితే వారికి మరో వియత్నాం యుద్ధం ఎదురవుతుందని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే వ్యాఖ్యానించారు. టెహ్రాన్‌లో తన కార్యాలయంలో నుంచి ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
ఖర్గ్ దీవిలో ఉన్న సైనిక కేంద్రాలను అమెరికా ఇప్పటికే లక్ష్యంగా చేసుకుందని, అవసరమైతే అక్కడ గ్రౌండ్ ఆపరేషన్ చేపట్టే అవకాశముందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ హెచ్చరికలు వెలువడ్డాయి. అమెరికా బలగాలు ఇరాన్ భూభాగంలోకి ప్రవేశిస్తే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని ఖతిబ్‌జాదే తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ దళాలతో ఎంతకాలమైనా పోరాడేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. యుద్ధాన్ని ఆపేందుకు దౌత్యపరమైన పరిష్కారాల కోసం ప్రస్తుతం ప్రయత్నాలు చేయడం లేదని కూడా పేర్కొన్నారు. వియత్నాం యుద్ధంలో జరిగిన పరిణామాలను అమెరికా మరోసారి గుర్తు చేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా ఇరాన్ కొత్త సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆరోగ్యంగా ఉన్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రజల ముందుకు రాకపోయినా దేశ పరిపాలనకు సంబంధించిన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ తాజాగా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడి చేసినట్లు సమాచారం. వెస్ట్ జెరుసలంలో ఉన్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం సమీపంలో ఒక క్షిపణి పడినట్లు ఇరాన్ వార్తా సంస్థ వెల్లడించింది. అయితే ఇజ్రాయెల్ రక్షణ దళాలు తమ వైమానిక రక్షణ వ్యవస్థతో కొన్ని క్షిపణులను అడ్డుకున్నట్లు ప్రకటించాయి. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రతరమయ్యాయి.



# బంగారం, డాలర్ కాదు.. ఇప్పుడు బిట్‌కాయిన్ హవా

**హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచంలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల మధ్య పెట్టుబడిదారుల దృష్టి కొత్త దిశగా మళ్లుతోంది. సాధారణంగా సంక్షోభ సమయంలో బంగారం, డాలర్ వైపు మొగ్గు చూపే ఇన్వెస్టర్లు ఇప్పుడు బిట్‌కాయిన్ వైపు అడుగులు వేస్తున్నారు.
ఇరాన్‌లో ప్రారంభమైన యుద్ధ ప్రభావంతో ప్రపంచ మార్కెట్లు అతలాకుతలం అవుతున్నాయి. చమురు సరఫరాలో అంతరాయం, స్టాక్ మార్కెట్లలో పడిపోతున్న సూచీలు పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయితే ఈ పరిస్థితుల్లో బిట్‌కాయిన్ మాత్రం అనూహ్యంగా బలంగా నిలుస్తోంది. ఫిబ్రవరి చివరి నుంచి ఇప్పటి వరకు దాని విలువ దాదాపు పది శాతం పెరిగి 72 వేల డాలర్ల స్థాయిని దాటింది.
సంక్షోభ సమయంలో బ్యాంకింగ్ వ్యవస్థలు దెబ్బతినే అవకాశం ఉండటంతో పాటు ప్రభుత్వ నియంత్రణలు పెరగవచ్చు. కానీ బిట్‌కాయిన్‌కు అలాంటి పరిమితులు లేకపోవడం, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడి నుండైనా తక్షణమే బదిలీ చేయగలగడం దీని ప్రధాన బలం. అందుకే పెట్టుబడిదారులు దీనిని కొత్త తరహా భద్రమైన ఆస్తిగా పరిగణించడం ప్రారంభించారు.
ఇక బంగారం ధరలు మాత్రం పెద్దగా పెరగకుండా స్థిరంగా ఉన్నాయి. అమెరికా డాలర్ బలపడటం, వడ్డీ రేట్లపై అనిశ్చితి కొనసాగడం బంగారంపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఈసారి బంగారం కంటే బిట్‌కాయిన్‌పై ఆసక్తి పెరిగింది.
మరోవైపు క్రిప్టో నిధుల్లో భారీగా పెట్టుబడులు చేరుతున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో, సులభంగా బదిలీ చేయగల, ప్రభుత్వాల నియంత్రణ తక్కువగా ఉండే బిట్‌కాయిన్‌ను భవిష్యత్తు డిజిటల్ బంగారంగా మార్కెట్ నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# ఇరాన్ యుద్ధంలో ట్రంప్‌కు మద్దతు తగ్గింపు

- అమెరికాతో కలిసి యుద్ధానికి నాటో దేశాల నిరాకరణ
- హర్మూజ్ జలసంధికి యుద్ధ నౌకలు పంపేందుకు వెనుకడుగు
- మాకు ఎవరి సహాయం అవసరం లేదని ట్రంప్ వ్యాఖ్య

**వాషింగ్టన్:** ఇరాన్‌పై ప్రారంభమైన యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అంతర్జాతీయ స్థాయిలో మద్దతు తగ్గుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇజ్రాయేల్‌తో కలిసి ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యలు కొనసాగిస్తున్న సమయంలో నాటో కూటమిలోని దేశాలు ఈ యుద్ధంలో పాల్గొనబోమని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో ట్రంప్‌కు మరో ఎదురు దెబ్బ తగిలినట్లు భావిస్తున్నారు. అమెరికా అభ్యర్థన మేరకు ఇరాన్‌పై చర్యల్లో భాగస్వామ్యం కావాలని ట్రంప్ నాటో దేశాలను కోరినట్లు తెలిసింది. అయితే ఈ విషయంలో ఆ దేశాలు సానుకూలంగా స్పందించలేదని సమాచారం. అమెరికా సైన్యాలతో కలిసి ఇరాన్‌పై యుద్ధంలో పాల్గొనబోమని నాటో సభ్య దేశాలు స్పష్టంగా తెలిపినట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి.
ఇరాన్‌తో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి ప్రాంతానికి యుద్ధ నౌకలను పంపాలన్న అమెరికా ప్రతిపాదనను కూడా పలు దేశాలు తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతం ప్రపంచ చమురు సరఫరాకు కీలక మార్గంగా ఉండటంతో యుద్ధ పరిస్థితులు మరింత ఉద్రిక్తతలకు దారితీయవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా నాటో దేశాలు సహకరించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. తమకు ఎవరి సహాయం అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇరాన్ అణ్వాయుధాల అంశంపై గతంలో ఆందోళన వ్యక్తం చేసిన నాటో దేశాలు ఇప్పుడు యుద్ధానికి దూరంగా ఉండటాన్ని ట్రంప్ అసహనం వ్యక్తం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాన్ని నివారించేందుకు పిలుపునిస్తున్నప్పటికీ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మధ్యప్రాచ్య ప్రాంతంలో పరిస్థితులు ఎలా మారుతాయన్నది ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిగా మారింది.



# బంగాల్ ఎన్నికలకు టీఎంసీ అభ్యర్థుల జాబితా విడుదల

- 291 మందితో తృణమూల్ కాంగ్రెస్ జాబితా
- భవానీపుర్ నుంచి పోటీకి సీఎం మమత
- బీజేపీపై తీవ్ర విమర్శలు

**కోల్కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 291 మంది అభ్యర్థులతో జాబితాను విడుదల చేసింది. పార్టీ అధినేత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం మీడియా సమావేశంలో ఈ జాబితాను ప్రకటించారు. మిగతా మూడు స్థానాలను తమ మిత్రపక్షం భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చాకు కేటాయించినట్లు ఆమె తెలిపారు. డార్జిలింగ్, కుర్సేఓంగ్, కాలింపాంగ్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు వెల్లడించారు.
ఈ జాబితా ప్రకారం మమతా బెనర్జీ భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. అక్కడ బీజేపీ తరపున రాష్ట్ర విపక్ష నాయకుడు సువేందు అధికారి బరిలోకి దిగనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతను సువేందు అధికారి ఓడించిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి నందిగ్రామ్‌తో పాటు భవానీపూర్ స్థానాన్ని కూడా ఆయనకే కేటాయించినట్లు సమాచారం. జాబితా విడుదల సందర్భంగా మమతా బెనర్జీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో వంటగ్యాస్ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆమె ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే ప్రజలను ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు సృష్టించకూడదని బీజేపీకి సూచించారు. ప్రజల్లోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోందని ఆమె వ్యాఖ్యానించారు.



ఈ ఎన్నికలు బెంగాల్ అస్తిత్వానికి సంబంధించినవని మమత పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పావులు కదిపినా బీజేపీకి అవకాశం దక్కదని ఆమె ఎద్దేవా చేశారు. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ అసెంబ్లీ సీట్లు తగ్గిపోతాయని, తృణమూల్ కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనకు ఉండే అధికారాలను కేంద్ర ప్రభుత్వం హరించిందని మమత ఆరోపించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు లేదా శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే బాధ్యత ఎవరిది అనే ప్రశ్నను ఆమె లేవనెత్తారు. కేంద్ర భద్రతా బలగాలను రాష్ట్రంలో మోహరించడం వంటి చర్యలపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. అభ్యర్థుల జాబితాలో పలువురు కీలక నేతలకు కూడా టీఎంసీ టికెట్లు కేటాయించింది. రాష్ట్ర మంత్రి చంద్రిమా భట్టాచార్యకు దుమ్ దుమ్ ఉత్తర్, ఫర్హాద్ హాకిమ్‌కు కోల్‌కతా పోర్ట్ నియోజకవర్గాలను కేటాయించారు. ఎమ్మెల్యే మదన్ మిత్రాకు కమర్హాతీ, కునాల్ ఘోష్‌కు బెలెఘాటా, డాక్టర్ శశి పాంజాకు శ్యామ్‌పుకుర్ స్థానాలను ఇచ్చారు. మాజీ విద్యామంత్రి పార్థ్ ఛటర్జీ ఆశించిన బెహాలా పశ్చిమ్ స్థానాన్ని రత్న ఛటర్జీకి కేటాయించారు.

# ఉద్యోగులకు శుభవార్త.. ఈపీఎఫ్‌వో 3.0తో డబ్బు విత్‌డ్రా వేగవంతం




**న్యూఢిల్లీ:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ప్రవేశపెట్టిన ఈపీఎఫ్‌వో 3.0 వ్యవస్థతో ఉద్యోగులకు భారీ ఊరట లభించింది. ఈ కొత్త డిజిటల్ సంస్కరణతో క్లెయిమ్ ప్రక్రియలు సులభతరమవడంతో పాటు డబ్బు ఉపసంహరణ వేగంగా జరుగుతోంది.
ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, క్లెయిమ్ సెటిల్‌మెంట్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో ఒక క్లెయిమ్‌ను పరిష్కరించడానికి సుమారు 20 రోజుల వరకు పట్టేది. అయితే ఇప్పుడు అదే ప్రక్రియ మూడు రోజుల్లోపే పూర్తవుతోంది. కేంద్రీకృత పింఛను చెల్లింపు వ్యవస్థను పూర్తిగా అమలు చేయడంతో ప్రతి నెలా లక్షలాది పింఛనుదారులకు సమయానికి, తప్పుల్లేకుండా చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ వ్యవస్థ వల్ల సేవలు మరింత పారదర్శకంగా మారాయి.క్లెయిమ్‌ల పరిష్కారంలో కూడా ఆటోమేటిక్ విధానం ప్రవేశపెట్టారు. ఐదు లక్షల రూపాయల వరకు ఉన్న లక్షలాది క్లెయిమ్‌లు స్వయంచాలకంగా పరిష్కరించబడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ శాతం అడ్వాన్స్ క్లెయిమ్‌లు మాన్యువల్ జోక్యం లేకుండానే ప్రాసెస్ చేయడం విశేషం. ఉద్యోగాలు మారే సమయంలో పీఎఫ్ ఖాతా బదిలీ ప్రక్రియ కూడా సులభమైంది. కేవలం ఒకసారి వివరాల ధృవీకరణ పూర్తయిన తర్వాత యజమాని ఆమోదం అవసరం లేకుండానే ఖాతా బదిలీ అవుతోంది. దీనివల్ల ఉద్యోగులకు సమయం, శ్రమ రెండూ ఆదా అవుతున్నాయి. ఈపీఎఫ్‌వో 3.0 ద్వారా అన్ని సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం వల్ల కాగితపు పని తగ్గి, సేవలు వేగంగా అందుతున్నాయి. దీంతో ఉద్యోగులకు మరింత సౌకర్యం కలుగుతోందని అధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఎలక్ట్రిక్ స్కూటర్లపై భారీ తగ్గింపు.. 123 కి.మీ ప్రయాణ సామర్థ్యం

హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):

ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయాలనుకునే వారికి మంచి అవకాశం లభించింది. ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ తన ప్రాచుర్యం పొందిన రిజ్టా ఎస్, 450ఎస్ స్కూటర్లపై ఆకర్షణీయమైన తగ్గింపు ఆఫర్లను ప్రకటించింది.

ఈ ఆఫర్ల ద్వారా వినియోగదారులు గరిష్టంగా ఇరవై వేల రూపాయల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది. ఈ రాయితీలు మార్చి 31 వరకు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంటాయి. డిస్కౌంట్ ప్యాకేజీలో పది వేల రూపాయల కార్డు తగ్గింపు, ఆరు వేల ఐదు వందల రూపాయల నగదు తగ్గింపు, మూడు వేల ఐదు వందల రూపాయల విలువైన అదనపు వారంటీ ఉన్నాయి. ఈ రాయితీలతో రిజ్టా ఎస్ ప్రారంభ ధర సుమారు ఒక లక్ష నాలుగు వేల ఏడు వందల యాభై ఎనిమిది రూపాయలకు తగ్గింది.

రిజ్టా ఎస్ స్కూటర్ కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది. సీటు కింద పెద్ద నిల్వ స్థలం ఉండటం, 123 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఉండటం దీని ప్రధాన ఆకర్షణలు. ఇందులో 2.9 కిలోవాట్ గంటల బ్యాటరీ ఉండి గంటకు 80 కిలోమీటర్ల వేగాన్ని అందిస్తుంది.

ఇక 450ఎస్ స్కూటర్ పట్టణ ప్రాంతాల్లో ప్రయాణించే వారికి అనుకూలంగా ఉంటుంది. ఇది సుమారు 115 కిలోమీటర్ల ప్రయాణ సామర్థ్యంతో శక్తివంతమైన మోటార్‌తో వస్తుంది. ఈ స్కూటర్లకు ఎనిమిది సంవత్సరాల బ్యాటరీ వారంటీ ఇవ్వడం వినియోగదారులకు మరింత నమ్మకాన్ని కలిగిస్తోంది. అదనంగా ప్రభుత్వ సబ్సిడీ ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉండటంతో ఖర్చు మరింత తగ్గుతుంది. పరిమిత కాలం మాత్రమే ఈ ఆఫర్లు అందుబాటులో ఉండటంతో, ఎలక్ట్రిక్ స్కూటర్ కొనుగోలు చేయాలనుకునే వారు త్వరగా నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఏప్రిల్ 1 నుంచి కొత్త క్రెడిట్ కార్డు నిబంధనలు..

### వినియోగదారులకు హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):

క్రెడిట్ కార్డులు ఉపయోగించే వారికి కీలక హెచ్చరిక వెలువడింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న ఏప్రిల్ 1వ తేదీ నుంచి పలు బ్యాంకులు తమ క్రెడిట్ కార్డు నిబంధనల్లో మార్పులు తీసుకురానున్నాయి. క్యాష్‌బ్యాక్, రివార్డ్ పాయింట్లు, లావాదేవీ ఛార్జీల్లో ఈ మార్పులు ప్రభావం చూపనున్నాయి.

ప్రధానంగా ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, యెస్ బ్యాంక్ తమ నిబంధనలను సవరించాయి. ఎయిర్‌టెల్ యాక్సిస్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు ఏప్రిల్ 12 నుంచి కొన్ని సేవలు నిలిచిపోనున్నాయి. ముఖ్యంగా జొమాటో, స్విగ్గీ, బిగ్ బాస్కెట్ వంటి ప్లాట్‌ఫామ్‌లపై ఇప్పటి వరకు లభించిన 10 శాతం క్యాష్‌బ్యాక్ నిలిపివేయనున్నారు. దాని బదులుగా ఇతర యాప్‌లలో కొత్త రకాల ఆఫర్లు ప్రవేశపెట్టనున్నారు.

యాక్సిస్ బ్యాంక్ ప్రకారం ప్రతి బిల్లింగ్ సైకిల్‌కు గరిష్ట క్యాష్‌బ్యాక్ పరిమితిని నిర్దేశించారు. ఇక యెస్ బ్యాంక్ గ్యాస్, నీరు, విద్యుత్ బిల్లుల చెల్లింపులపై పరిమితులు విధించనుంది. నిర్ణయించిన పరిమితి దాటితే ఒక శాతం అదనపు ఛార్జీ వసూలు చేయనున్నారు. టోల్, బ్రిడ్జ్ చెల్లింపులపైనా ఇదే విధమైన ఛార్జీలు అమలు కానున్నాయి. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై కూడా కొత్త నియమాలు అమల్లోకి రానున్నాయి. నెలకు గరిష్టంగా అరవై వేల రివార్డ్ పాయింట్లను మాత్రమే స్టేట్‌మెంట్ క్రెడిట్‌గా మార్చుకునే అవకాశం ఉంటుంది. అలాగే నాలుగు వేల పాయింట్ల గుణితాల్లోనే రివార్డ్ పాయింట్ల వినియోగం చేయాల్సి ఉంటుంది. కొన్ని ప్రత్యేక కార్డులకు మాత్రం ఈ నిబంధనలు వర్తించవు.

ఈ మార్పులపై వినియోగదారులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. లేకపోతే అనవసరంగా అదనపు ఛార్జీలు చెల్లించాల్సి రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.





## మారుతి సుజుకికి ఐటీ శాఖ నోటీసులు.. భారీ పన్ను డిమాండ్

**న్యూఢిల్లీ:** దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్‌కు ఆదాయపు పన్ను శాఖ భారీ నోటీసులు జారీ చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నుల విషయంలో సుమారు రూ.5,786 కోట్లను చెల్లించాలని డ్రాఫ్ట్ అసెస్‌మెంట్ ఆర్డర్‌లో పేర్కొంది.

కంపెనీ సమర్పించిన పన్ను రిటర్నుల పరిశీలనలో కొన్ని అదనపు చేర్పులు, తగ్గింపులు అవసరమని అధికారులు భావించారు. ఈ మార్పుల ఆధారంగా మొత్తం పన్ను బాధ్యతను గణనీయంగా పెంచుతూ ఈ నోటీసు జారీ చేసినట్లు తెలుస్తోంది.

ఈ పరిణామంపై మారుతి సుజుకి యాజమాన్యం స్పందిస్తూ, చట్టపరంగా దీనిని ఎదుర్కొంటామని స్పష్టం చేసింది. డిస్ప్యూట్ రిజల్యూషన్ ప్యానెల్ ముందు తమ అభ్యంతరాలను సమర్పించనున్నట్లు తెలిపింది. ఈ పన్ను వివాదం కంపెనీ కార్యకలాపాలపై లేదా ఆర్థిక పరిస్థితిపై ఎలాంటి ప్రభావం చూపదని సంస్థ నమ్మకం వ్యక్తం చేసింది.

ఇదిలా ఉండగా, ఈ వార్త వెలువడినప్పటికీ షేర్ మార్కెట్లో కంపెనీపై పెట్టుబడిదారుల విశ్వాసం కొనసాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి షేర్ ధర సుమారు 1.82 శాతం పెరిగి రూ.12,986 వద్ద నిలిచింది.

ఇటీవల మూడో త్రైమాసికంలో కంపెనీ బలమైన లాభాలను నమోదు చేయడం, అమ్మకాలలో స్థిరమైన వృద్ధి కనబరచడం వల్ల ఈ నోటీసును పెట్టుబడిదారులు తాత్కాలిక అంశంగానే భావిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## రూ. 16 వేలకే వన్‌ప్లస్ ఐదు జీ ఫోన్.. అదిరే తగ్గింపు

హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ సంస్థ వన్‌ప్లస్ తన బడ్జెట్ శ్రేణి ఫోన్‌పై భారీ తగ్గింపును ప్రకటించింది. మధ్యతరగతి వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని విడుదల చేసిన నార్డ్ సీఈ నాలుగు లైట్ ఐదు జీ మోడల్ ఇప్పుడు తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చింది.

ఈ ఫోన్ ప్రారంభ ధర సుమారు ఇరవై వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయలు కాగా, ప్రస్తుతం భారీ తగ్గింపుతో దాదాపు పదహారు వేల రూపాయల పరిధిలో లభిస్తోంది. అదనంగా బ్యాంక్ రాయితీలు, పాత ఫోన్ మార్పిడి వంటి సదుపాయాలతో ధరను ఇంకా తగ్గించుకునే అవకాశం ఉంది.



ఫోన్‌లో ఆరు దశాంశం ఆరు ఏడు అంగుళాల అమోలెడ్ తెరను అమర్చారు. నూట ఇరవై హెర్ట్జ్ రిఫ్రెష్ రేటు సపోర్ట్ ఉండటంతో స్క్రీన్ కదలికలు మరింత సాఫీగా కనిపిస్తాయి. ఎక్కువ వెలుతురు ఉన్న ప్రదేశాల్లో కూడా స్పష్టంగా కనిపించేలా అధిక ప్రకాశాన్ని అందించారు.

ఫోటోగ్రఫీ కోసం యాభై మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా ఉంది. చిత్రాలు, వీడియోలు కదలికల వల్ల దెబ్బతినకుండా స్పష్టంగా రావడానికి ప్రత్యేక స్థిరీకరణ సదుపాయం కల్పించారు. ముందుభాగంలో పదహారు మెగాపిక్సెల్ కెమెరా అందించారు.

బ్యాటరీ విషయానికి వస్తే ఐదు వేల ఐదు వందల మిల్లీ అంపియర్ సామర్థ్యం గల బ్యాటరీను అమర్చారు. సాధారణ వినియోగంలో రెండు రోజుల వరకు పనిచేసే సామర్థ్యం ఉందని సంస్థ తెలిపింది. వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం ఉండటంతో తక్కువ సమయంలోనే పూర్తిగా ఛార్జ్ అవుతుంది.

ఈ ఆఫర్లు పరిమిత కాలం మాత్రమే ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు చేయాలనుకునే వారు త్వరగా నిర్ణయం తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## కాకినాడలో ఫైవ్ స్టార్ హోటల్.. భారీ రాయితీలతో ప్రాజెక్ట్ ప్రారంభం

కాకినాడ నగరంలో పర్యాటక రంగానికి కొత్త ఊపు తీసుకొచ్చేలా అంతర్జాతీయ స్థాయి ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ప్రముఖ తాజ్ బ్రాండ్‌తో ఈ ప్రాజెక్ట్‌ను ఎస్‌వీఎస్ కనస్ట్రక్షన్స్ సంస్థ చేపట్టనుంది.

సుమారు రూ.104 కోట్ల పెట్టుబడితో 3.4 ఎకరాల విస్తీర్ణంలో ఈ హోటల్ నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కాకినాడలో తొలి అంతర్జాతీయ ప్రమాణాల లగ్జరీ హోటల్ అందుబాటులోకి రానుంది.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం గరిష్టంగా రాయితీలు ప్రకటించింది. ఆయుష్ ఆసుపత్రి సమీపంలోని భూమిని దాదాపు 66 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. హోటల్ పనితీరు ఆధారంగా మరో 33 ఏళ్ల వరకు లీజును పొడిగించే అవకాశం కూడా కల్పించింది.



అదనంగా పెట్టుబడిదారులకు ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలలో సడలింపులు కూడా ఇవ్వనున్నారు. ఈ రాయితీలతో సంస్థపై ఆర్థిక భారం తగ్గి, నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసే అవకాశం ఉంది.

ఈ హోటల్ నిర్మాణంతో సుమారు 300 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. కాకినాడ పోర్టు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, ఈ హోటల్ వ్యాపారవేత్తలు మరియు పర్యాటకులకు కీలక కేంద్రంగా మారే అవకాశముంది.

ఇక మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా చీడిలపొర కాలువపై కొత్త రహదారి నిర్మాణం కూడా చేపడుతున్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి ఈ విలాసవంతమైన హోటల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

## ఏప్రిల్ నుంచి కార్ల ధరలు పెరుగుదల.. వినియోగదారులకు షాక్

కొత్త కారు కొనాలనుకునే వారికి వాహన తయారీ సంస్థలు షాక్ ఇవ్వనున్నాయి. రూపాయి విలువ పతనం, ముడిసరకుల ధరల పెరుగుదల కారణంగా వచ్చే నెల నుంచి కార్ల ధరలను పెంచాలని ప్రముఖ కంపెనీలు నిర్ణయించాయి.

ఇప్పటికే ఈ ఏడాది జనవరిలో ఒకసారి ధరలను పెంచిన సంస్థలు, ఇప్పుడు రెండోసారి పెంపుకు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా లగ్జరీ కార్ల తయారీ సంస్థలు మెర్సిడెస్ బెంజ్, ఆడి తమ మోడళ్లపై సుమారు రెండు శాతం వరకు ధరలను పెంచనున్నట్లు ప్రకటించాయి. రూపాయి విలువ యూరోతో పోలిస్తే బలహీనపడడం వల్ల దిగుమతి భాగాల ఖర్చు పెరిగిందని, దాని ప్రభావాన్ని వినియోగదారులపై మోపాల్సి వస్తోందని సంస్థలు తెలిపాయి.



మరోవైపు దేశీయ దిగ్గజం టాటా మోటార్స్ కూడా తన వాణిజ్య వాహనాల ధరలను దాదాపు ఒకున్నర శాతం వరకు పెంచనున్నట్లు వెల్లడించింది. ఉక్కు, అల్యూమినియం వంటి లోహాల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం అధికమైందని సంస్థ పేర్కొంది.

ఇదే తరహాలో దేశంలో అత్యధికంగా కార్లను విక్రయించే మారుతీ సుజుకీ, హ్యుందాయ్ సంస్థలు కూడా ఏప్రిల్ నుంచి ధరల పెంపు దిశగా అడుగులు వేస్తున్నాయి. దీనివల్ల మధ్యతరగతి కుటుంబాలు కొనుగోలు చేసే బడ్జెట్ కార్ల ధరలు కూడా కొన్ని వేల రూపాయల మేర పెరిగే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో పాత ధరలకే కారు కొనాలనుకునే వారు ఈ నెలాఖరులోపు బుకింగ్ చేసుకోవడం మంచిదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

## గోల్డ్ రేట్లు భారీగా పతనం.. హైదరాబాద్‌లో తాజా ధరలు

హైదరాబాద్, మార్చి 17 (తెలంగాణ ముచ్చట్లు):

పసిడి ప్రియులకు ఊరట కలిగించే వార్త వచ్చింది. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు ఇప్పుడు ఒక్కసారిగా పడిపోవడంతో కొనుగోలుదారులకు మంచి అవకాశం లభించింది.

హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల బంగారం ధర ఒక్కరోజులోనే రెండు వేల రూపాయలకుపైగా తగ్గింది. ప్రస్తుతం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,300 వద్ద కొనసాగుతోంది. అలాగే 24 క్యారెట్ల బంగారం ధర కూడా గణనీయంగా పడిపోయి రూ.1,57,420 వద్ద ట్రేడ్ అవుతోంది.

వెండి ధర కూడా బంగారం బాటలోనే పడిపోయింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.76 లక్షల వద్ద కొనసాగుతోంది.

ధరలు తగ్గడానికి ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్లలో ఏర్పడిన అనిశ్చితి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం నేపథ్యంలో వడ్డీ రేట్లపై స్పష్టత లేకపోవడం మార్కెట్లపై ప్రభావం చూపుతోంది. వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు తక్కువగా ఉన్నాయని అంచనాలు ఉండడంతో బంగారంపై పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గుతోంది.



మరోవైపు అమెరికా డాలర్ విలువ పెరగడం కూడా బంగారం ధరలపై ఒత్తిడిని పెంచుతోంది. డాలర్ బలపడితే పెట్టుబడులు ఆ వైపు మళ్లడం వల్ల బంగారం ధరలు తగ్గుముఖం పడతాయి. అలాగే ట్రెజరీ బాండ్ లాభాలు పెరగడం కూడా బంగారం ఆకర్షణను తగ్గిస్తోంది.

అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు సుమారు ఐదు వేల డాలర్ల వద్ద ట్రేడ్ అవుతుండగా, వెండి ధర సుమారు 81 డాలర్ల స్థాయిలో ఉంది.

గత ఐదు రోజులలోనే దేశీయంగా బంగారం ధర దాదాపు రూ.5,400 మేర తగ్గింది. వరుసగా తగ్గుతున్న ధరల నేపథ్యంలో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది అనుకూల సమయమని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in